క్లుప్తంగా

సీఎంకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న దేవపూజ ధనుంజయాచారి

కర్నూలు(అర్బన్): పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల విశ్వబ్రాహ్మణ నేతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి మాట్లాడుతూ వివిధ ఆలయాలతో పాటు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాలకు పథకాన్ని వర్తింపజేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ పథకం కింద ఆయా ఆలయాలకు ప్రభుత్వం రూ.5 వేలను అందించనుందన్నారు. సమావేశంలో జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కేఎస్ బ్రహ్మయ్య ఆచారి, నేతలు బంతికట్ల మల్లికార్జున ఆచారి, మదనమోహన ఆచారి, వేణుగోపాలాచారి, గడ్డం మల్లికార్జునాచారి, దుర్గయ్య ఆచారి, బ్రహ్మయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్యుని జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి



ఏకలవ్యుని చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): విలువిద్యలో గురువును మించిన శిష్యునిగా పురాణాల్లో ప్రసిద్ధి చెందిన ఏకలవ్యుని జయంతిని ప్రభుత్వం నిర్వహించాలని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజు కోరారు. ఏకలవ్యుని జయంతిని పురస్కరించుకుని స్థానిక వైహెచ్‌పీఎస్ కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వై రాజు మాట్లాడుతూ విలు విద్యలో సాటిలేని వీరుడైన ఏకలవ్యుడు మనువాదుల కుట్రలకు బలయ్యారన్నారు. కార్యక్రమంలో పత్తికొండ తాలూకా అధ్యక్షులు ఎరుకల పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీసీఎల్ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(రూరల్): జిల్లాలో గ్యాస్ పైప్ లైన్ పనులు నాసిరకంగా చేపడుతున్న హెచ్‌పీసీఎల్ సంస్థ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం హసన్ నుంచి తెలంగాణ రాష్ట్రం చంచల్‌గూడ వరకు వేసిన గ్యాస్ పైపు లైన్ జిల్లాలోని తుగ్గలి మండలంలో ప్రారంభమై కర్నూలు మండలం సింగవరం వద్ద తెలంగాణలోకి వెళ్తుందన్నారు. జిల్లాలో పైపులైన్ కోసం తీసిన గుంతలను మెత్తటి మట్టి, ఇసుకతో కాకుండా రాళ్లతో నింపడం వల్ల కొన్నిచోట్ల వాగులు వచ్చి కోతకు గురైందన్నారు. పైపులైన్ బయటకు రావడం ద్వారా గ్యాస్ లీకు అయితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్‌తోనే ఏపీకి ప్రత్యేక హోదా

కర్నూలు(రూరల్): కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని డీసీసీ అధ్యక్షుడు సుధాకర్ బాబు తెలిపారు. గురువారం నగరంలోని కళా వెంకట్రావ్ భవనంలో డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ నాయకులు కృష్ణారెడ్డి, నాగేషు ఆధ్వర్యంలో దాదాపు 25 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌బాబు మాట్లడుతూ విభజన హామీలు, ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బజారన్న, మహిళ నాయకురాలు ప్రమీల పాల్గొన్నారు.

మహలనోబిష్‌కు ఘన నివాళి



పీసీ మహలనోబిష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): గణాంక శాస్త్ర పితామహులు ప్రొఫెసర్ పీసీ మహలనోబిష్ అని, ఆయన చూపిన తోవలోనే ప్రపంచమంతా గణాంకాలు చేసుకుంటూ ముందుకెళ్తోందని సీపీఓ జేడీ అప్పలకొండ అన్నారు. పీసీ మహలనోబిష్ జయంతి, 17వ జాతీయ గణాంక దినోత్సవాలను పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సీపీఓ జేడీ అప్పలకొండ, ఏడీ భారతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ పీసీ మహలనోబిష్ భారతీయుడు కావడం గర్వకారణమన్నారు. ఆయన ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారన్నారు.



జొహరాపురంలోని ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింమహిళలు



గడ్డా ప్రాంతంలోని అహిలే హదీస్ ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ఈద్ ముబారక్!

- జిల్లాలో ఘనంగా ఈద్-ఉల్-అద్హా
- బక్రీద్ సందర్భంగా ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- సర్వ మానవాళి కోసం దువా చేసిన మత పెద్దలు



జొహరాపురంలోని ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర బక్రీద్ పండుగ ఈదుల్ అద్హాను జిల్లా వ్యాప్తంగా ముస్లింలు ఘనంగా చేసుకున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే స్నానాలచరించి కొత్త దుస్తులు ధరించి ఈద్గాలకు చేరుకున్నారు. ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులకు వెళ్లి ఈద్ నమాజు చదువుకున్నారు. ఈద్గాలు, మసీదులు కిక్కిరిసిపోవడంతో కొన్ని చోట్ల రోడ్లపైనే నమాజు చదువుకున్నారు. ఖాజీలు, మౌల్వీల ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేశారు. సర్వ మానవాళి శాంతి కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. అనంతరం ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ కరచాలనం, ఆలింగనం చేసుకున్నారు. కొందరు బక్రీద్ చంద్రదర్శనం మరుసటి రోజు నుంచి ఉపవాసాలు ఉండగా వీటి ప్రత్యేకత, పుణ్యం తెలుసుకొని మరి కొందరు ఈద్‌కు ఒక రోజు ముందు రోజా పాటించారు. ఇంకొందరు ఈద్ నమాజ్ పూర్తయ్యే వరకు ఏమీ తినకుండా ప్రార్థనలు చేశారు.

ఈద్ నమాజులో ప్రముఖులు

- కొత్త బస్టాండ్ సమీపంలోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీంబాషా ఖాద్రీ, కొత్త ఈద్గాలో మౌల్వీ జుబేర్ మౌలానా, గడ్డలోని అహిలే హదీస్ ఈద్గాహ్‌లో మౌలానా అబ్దుల్ రెహ్మాన్ అమ్రి, జొహరాపురం ఈద్గాహ్‌లో హఫీజ్ ఫరూఖ్ మదాని, లతీఫ్ లవుబాలి మసీదులో సయ్యద్ ఆరీఫ్ పాషా ఖాద్రీ నమాజ్ చేయించారు.

సంతోష్‌నగర్‌లోని కొత్త ఈద్గాలో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో పాటు సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ ఎ.ఎం.డి.ఇంతియాజ్, ఇతర ప్రముఖులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలకు ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పి ఈదుల్ అద్హా పండుగ ఫలాలు అందరికీ చేకూరాలని కోరారు.







ప్రార్థనలకు పిల్లలతో ఈద్గాలకు తరలివెళ్తున్న ముస్లింలు, సంతోష్ నగర్ ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి





వెంకటరమణ కాలనీలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



అలివేలు మంగమ్మ, స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు





పూజలుందుకుంటున్న సాయినాథుడు, సాయినాథుడి పూజల్లో భక్తులు

తొలి ఏకాదశిని నగర వాసులు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. తెల్లవారుజామునే స్నానాలాచరించి, పిండి వంటలు చేసుకుని ఇంటిల్లిపాదితో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు నైవేద్యం, కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వెంకటరమణ కాలనీలోని వేంకటేశ్వరస్వామి, అలివేలు మంగమ్మలను పూజారులు ప్రత్యేకంగా అలంకరించి భక్తలకు దర్శన భాగ్యం కల్పించారు. పాతబస్టాండ్‌లోని పాండురంగ స్వామి ఆలయం నుంచి పూజ బజార్ వరకు సాగిన పాండురంగస్వామి ప్రభోత్సవంలో మహిళల కోలాటం ఆకట్టుకుంది. భక్తులతో సాయిబాబా ఆలయం కిక్కిరిసింది.



పాండురంగా స్వామి ప్రభోత్సవంలో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



పాండురంగ, రుక్మిణీదేవిలకు కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



పూజలందుకున్న జగన్నాథ సుభద్ర, బలదేవ్ స్వామి, అమ్మవార్లు

కమనీయం .. కల్యాణం

- తొలి ఏకాదశి సందర్భంగా కనుల పండువగా రుక్మిణీ పాండురంగ స్వామి కల్యాణం

కర్నూలు(సెంట్రల్): నగరంలోని చిత్తారివీధిలో వెలసిన నిమిషాంబ దేవి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం ఉదయాన్నే అర్చకులు రుక్మిణీదేవి, పాండురంగ స్వాములను ప్రత్యేకంగా అలకరించారు. అనంతరం అర్చన, కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజల అనంతరం పాండురంగ, రుక్మిణీదేవిల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శించుకొని తీర్థ ప్రసాదాలను అందుకున్నారు. కల్యాణోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన భార్య విజయ మనోహరి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహవర్మ తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ జగన్నాథ మందిరంలో..

కర్నూలు(సెంట్రల్): మానవుడు విశ్వశాంతిని కోరుకోవాలని ఇస్కాన్ ఆలయాల బాధ్యుడు రామకకృష్ణ ప్రభు సందేశం ఇచ్చారు. గురువారం ఇస్కాన్ జగన్నాథ మందిరంలో తొలి ఏకాదశి వేడుకలు జరిగాయి. 64 జప యజ్ఞమాలల నిర్వహణ, హరే రామ హరే కృష్ణ హరే కృష్ణ హరే రామ జపయజ్ఞం నిర్వహించారు. అనంతరం జగన్నాథ సుభద్ర బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన కల్లూరు అర్బన్ 28వ వార్డులోని బీఆర్ రెడ్డి కాలనీలో కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డితో కలిసి పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పథకాలపై ఆరా తీశారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాసులు, లక్ష్మీకాంతరెడ్డి, జయరాముడు, నరసింహులు, విక్రమసింహారెడ్డి, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డ్ చైర్మన్ మీది వేముల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యసాధనే ధ్యేయంగా చదవాలి

కర్నూలు (అర్బన్): లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ఆ దిశగా చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మీదేవి విద్యార్థులకు సూచించారు. గురువారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన మోటివేషన్, అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు చేరుకుని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, సహాయ సంక్షేమ అధికారి బి.మద్దిలేటి, మోటివేషన్ స్పీకర్ కె.మహేంద్ర, డీవీఎంసీ సభ్యులు వై.రాజు, కె.శాంతికుమార్, యు.రమేష్ బాబు, సీనియర్ న్యాయవాది కె.రామకృష్ణారెడ్డి, హెచ్‌డబ్ల్యూఓలు కె.వెంకటరెడ్డి, జి.సుంకన్న, బెన్నమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ రంగలక్ష్మీదేవి

రోడ్డుప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు సమీపాన రాగమయూరీ విద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నన్నూరు గ్రామానికి చెందిన జలాలుద్దీన్ ద్విచక్రవాహనంపై రాగమయూరి నుంచి జాతీయ రహదారిపైకి వెళ్తున్నాడు. అదే సమయంలో నంద్యాల నుంచి కర్నూలు వైపు అతివేగంతో వస్తున్న ఏపీ 39 ఎస్‌వై 9645 నంబర్ వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. జలాలుద్దీన్ కాలు, ముఖానికి రక్తగాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జేసీఎస్ వార్డు కన్వీనర్ల నియామకం

కర్నూలు(రాజ్‌విహార్): జగనన్న వార్డు కన్వీనర్లు, గృహ సారథుల వార్డుల ఇన్‌చార్జులు నియమితులయ్యారు. నియోజకవర్గంలోని సీ–1లో 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 11, 12 వార్డుల ఇన్‌చార్జ్‌గా ఎజాజ్‌అలీఖాన్, సీ–2లో 14, 15, 16, 17, 18, 22, 23, 24, 25 వార్డుల ఇన్‌చార్జ్‌గా సయ్యద్ అంజాద్, సీ–3లో 13, 42, 43, 44, 45, 46, 47, 48, 49, 50, 51, 52 వార్డుల ఇన్‌చార్జ్‌గా టి.సతీష్‌బాబులను పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు వైఎస్‌ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

నేడు విద్యుత్ భవన్ ఎదుట ధర్నా

కర్నూలు(రూరల్): సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని విద్యుత్ భవన్ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించనున్నట్లు సీపీఎం కార్యవర్గ సభ్యులు నరసింహులు తెలిపారు. గురువారం ఆయన నగరంలోని శ్రీరామ్‌నగర్‌లో ఇంటింటికి తిరిగి ధర్నాకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శేషం రాజు, అజ్మత్, హనుమంతు, నరసింహులు, పాండు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ భళా!

- తైక్వాండోలో రాణిస్తున్న క్రీడాకారులు
- వేసవి శిక్షణ శిబిరం తరగతులను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు
- ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుందంటున్న అమ్మాయిలు

కర్నూలు(రూరల్): వేసవి శిక్షణను పలువురు క్రీడాకారులు సద్వినియోగం చేసుకున్నారు. ఆత్మరక్షణ కోసం తైక్వాండో క్రీడలో విద్యార్థినులు పలు మెలకువలు నేర్చుకుని సంతృప్తి చెందుతున్నారు. క్రీడలతో ఏకాగ్రతతో పాటు మానసికంగా సంతృప్తి చెందుతున్నారు. నగరంలోని పెద్ద మార్కెట్, కేఎంసీ పార్క్, ఎ.క్యాంప్ సమీపంలోని అకాడమీలో ప్రతి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. పదుల సంఖ్యలో క్రీడాకారులు హాజరై కిక్, పంచ్ కొట్టడం, డిఫెన్స్ చేయడం వంటి అంశాల్లో ప్రత్యేక తర్ఫీదు పొంది రాటుదేలారు. వేసవి శిబిరం అనంతరం కూడా శిక్షణను కొనసాగిస్తున్నారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో పథకాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులు

ఆత్మ రక్షణ కోసం



నేను సీరాక్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాను. ప్రతిరోజు శిక్షణకు హాజరవుతున్నాను. తైక్వాండో నేర్చుకోవడం వల్ల స్వీయ ఆత్మ రక్షణకు ఉపయోగపడుతుంది. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటాం. భవిష్యత్‌లో జాతీయ స్థాయిలో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకుంటాను.

– శ్రీలలిత, బాలజీ నగర్, కర్నూలు

అమ్మ ప్రోత్సాహం



మా అమ్మ వృత్తిరీత్యా వైద్యురాలు. నేను మాంటీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాను. అమ్మ ప్రోత్సాహంతో ప్రతిరోజు ఇక్కడికి వచ్చి శిక్షణ తీసుకుంటున్నాను. శిక్షణ ద్వారా క్రీడలో పంచ్, కిక్ కొట్టడం, టర్నింగ్ తీసుకోవడం వంటి మెలకువలు నేర్చుకున్నాను.

– ఎ.ఆరోన్, కర్నూలు

జాతీయ స్థాయిలో రాణించా



మాది నగరంలోని చిత్తారి వీధి. నాన్న వృతి రీత్యా వస్త్ర వ్యాపారి. చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా ఇష్టం. నేను 2007లో గోవా రాష్ట్రంలో జరిగిన జాతీయ స్థాయి పోటీలో పాల్గొని పతకం సాధించాను. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధిస్తా.

– ఊర్మిల, జాతీయ స్థాయి కీడాకారిణి, కర్నూలు

16 ఏళ్లుగా శిక్షణ ఇస్తున్న



మాది బండిమెట్ట. నాకు చిన్నప్పటినుంచే క్రీడలంటే చాలా ఇష్టం. క్రీడలపై ఉన్న ఆసక్తితో 16 ఏళ్లుగా శిక్షకుడిగా పనిచేస్తున్నాను. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ ఇస్తూ క్రీడాకారుల్లో లోపాలను గుర్తించి వాటిని సవరిస్తూ ఉత్తమ క్రీడాకారులుగా తీర్చి దిద్దుతున్నాను. – వెంకటేశ్వర్లు, తైక్వాండో శిక్షకులు



గాయపడిన బోయ పెద్ద గుంటెప్ప వర్గీయులు



చాకలి పెద్ద నల్లన్న వర్గీయులు

పొలం విషయంలో ఇరువర్గాల ఘర్షణ

- 16 మందికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పొలం విషయంలో గురువారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి 16 మందికి గాయాలయ్యాయి. పోలీసులకు తెలిపిన వివరాల మేరకు.. గుడేకల్ గ్రామానికి చెందిన చాకలి పెద్ద నల్లన్న కొన్ని సంవత్సరాలుగా ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటూ పట్టాదారు పాస్ పుస్తకం పొందాడు. అయితే పొలం పక్కనే ఉన్న బోయ పెద్ద గుంటెప్ప తనకూ ఈ ఐదు ఎకరాలపై హక్కు ఉందని గొడవపడేవాడు. సమస్య పోలీసులు, రెవెన్యూ అధికారుల వద్దకు వెళ్లడంతో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఐదు ఎకరాలపై హక్కు చాకలి పెద్ద నల్లన్నకే ఉందని తేల్చి చెప్పారు. అయితే గురువారం పొలం పనులకు వెళ్తున్న చాకలి పెద్ద నల్లన్న కుటుంబ సభ్యులతో బోయ పెద్ద గుంటెప్ప కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఇరు వర్గాల వారు రాళ్లు కర్రలు, కారంతో దాడులు చేసుకోవటంతో 16 మందికి గాయాలయ్యాయి. గాయపడిన చాకలి పెద్ద నల్లన్న, శ్రీనివాసులు, నడిపి నల్లన్న, తిమ్మప్ప, వెంకటేష్, తిప్పన్న, నడవలయ్య, రాజు, ఈరమ్మ, లక్ష్మి, మల్లమ్మ, బోయ పెద్ద గుంటెప్ప, నడవలయ్య, ఆంజనేయులు, నాగమ్మ, సునీతను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎమ్మిగనూరు రూరల్ ఎస్ఐ పి.నిరంజన్‌రెడ్డి తెలిపారు.